క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత విన్నవించారు. గుంటూరు నగరంలోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం ఏపీ అంగన్‌వాడీ, వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ అనుబంధం సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జె.లలిత మాట్లాడుతూ ఈనెల 21 స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డిని ఆయన కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ అనుంబంధ అంగన్‌వాడీ సంఘాల కలిసి సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. తక్షణమే 42 రోజుల సార్వత్రిక సమ్మె మినిట్స్ కాపీలో పొందుపరిచిన ప్రకారంగా, వేతనాల పెంపు, గ్రాడ్యూటీ చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలు, ఫైవ్ జీబీ మొబైల్స్, చనిపోయిన వారికి మట్టి ఖర్చుల నగదు వెంటనే చెల్లించాలని కోరడం జరిగిందన్నారు. సమావేశంలో డి.రత్నకుమారి, సాబీర, జిల్లా కౌన్సిల్ మెంబర్స్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా వల్లూరు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర కమిటీ శుక్రవారం ప్రకటించిన పదవుల్లో జిల్లాకు చెందిన వల్లూరు జయప్రకాష్ నారాయణ ముఖ్య అధికార ప్రతినిధిగా, బిట్రా శివన్నారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, మకుటం శివ రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్‌గా స్థానం దక్కించుకున్నారు. వల్లూరి జయప్రకాష్ నారాయణ బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేశారు. 2019లో గుంటూరు పార్లమెంట్ సభ్యులుగా పోటీ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎస్. మాధవ్ కమిటీలో ముఖ్య అధికారి ప్రతినిధిగా వల్లూరు జయప్రకాష్ నారాయణను నియమించడంపై గుంటూరు జిల్లా బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

మీ సమస్యల్ని తప్పక పరిశీలిస్తాం

ఐఎంఏ బృందానికి సీఎం చంద్రబాబు హామీ



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర ఐఎంఏ బృందం శుక్రవారం కలిసింది. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాల్లో సేవల్ని మరింత విస్తృత పరచడంలోనూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలోనూ రాష్ట్ర ఐఎంఏ ఎల్లప్పుడూ ప్రభుత్వానికి సహకరిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా వైద్యులపై దాడుల విషయంలో ప్రస్తుతం ఉన్న చట్టంలో మరికొన్ని మార్పులు చేయాలని, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ల విషయంలో అగ్నిమాక శాఖ నిబంధనలను కొన్నింటిని సవరించాలని వినతిపత్రంలో కోరారు. పది పడకల లోపు ఆసుపత్రుల విషయంలో మరిన్ని సడవింపులు అవసరమన్నారు. ఫైర్ ఎన్‌ఓసీ రెన్యువల్ ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి పెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. సీఎంను కలిసిన వారిలో ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎం.జె.సి. నాయుడు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం పాలక కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.సురేష్ పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: గుంటూరు సుదర్శిని కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో పెదనందిపాడు మండలం అన్నవరం గ్రామంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ గణేశుని రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక పరికరాలతో కూడిన సంచార కంటి ఆసుపత్రిని గ్రామానికి తీసుకొచ్చి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 9395561919, 8886716515 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



గుంటూరు మెడికల్: గుంటూరు పట్టణంలోని అమృత, యాంజియో కేర్, తాక్కెళ్లపాడు కిమ్స్ చక్ర ఆసుపత్రులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రుల్లో రోగులకు సేవలందించే వైద్య సేవల ఫీజుల వివరాలు తెలిపే ధరల పట్టికలు లేకపోవడం గమనించారు. ఆసుపత్రుల్లో రోగులకు సరిపడ వెంటిలేషన్ సదుపాయం లేకపోవడంతో సంబంధిత ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ అల్లోపతి యాక్ట్ ను అతిక్రమించిన ఆసుపత్రులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పేద ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రులు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. తప్పనిసరిగా ఫీజుల వివరాలు, రోగులు వేచి ఉండే గదుల వద్ద ఫీజుల వివరాలు కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు.

ఎక్కడి పనులు అక్కడే..

అంతా మాకే కావాలి

- కాంట్రాక్టర్ల కక్కుర్తితో మందకొడిగా పనులు
- 30 నుంచి 40 శాతం వర్క్‌లు తీసుకుంటున్న టీడీపీ నేతలు
- ఒక్క వర్క్ కూడా సక్రమంగా చేయని వైనం
- నగరంలో సగం పని చేసి వదిలేసిన రోడ్లు, డ్రైయిన్లే దర్శనం



నల్లచెరువు 18వ లైనులో రోడ్డు మీదకు చేరిన మురుగునీరు

నెహ్రూనగర్: నగర అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. ఎక్కడ పనులు అక్కడే ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగు తమ్ముళ్లు చాలా మంది కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. ప్రతి వర్క్ తమకే కావాలని పట్టుపడుతున్నారు. దీని కోసం ప్రజాప్రతినిధులను అడ్డంపెట్టుకుని టెండర్లను దక్కించుకుంటున్నారు. టెండర్లు దక్కించుకున్న వారు పనులు ప్రారంభిస్తారా అంటే అది లేదు సగం సగం చేసి అలాగే వదిలేస్తున్నారు.

నల్లచెరువులో 5 నెలల నుంచి ఇబ్బందులు

నల్లచెరువులో 18, 19, 21వ లైన్లులో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. అయితే వర్క్‌ను ప్రారంభించే ముందుగా డ్రెయిన్ల కోసం ఇంటి ముందు మెట్లు తొలగించి, కంకర బెడ్ వేసి వదిలేశారు. ఇలా ఐదు నెలల నుంచి స్థానిక వాసులు కాలువలు, రోడ్డు వేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఇటీవల సదరు ఆగిపోయిన పనుల వలన ఓ మహిళ కింద పడి కాలు విరిగింది. ఆమెకు ఆపరేషన్ చేశారు. దీంతో స్థానికులంతా సదరు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి నానా యాగీ చేయడంతో ప్రస్తుతం ఒక వీధిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అదే విధంగా డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు.



డ్రెయిన్స్ నిర్మించకపోవడంతో చెక్కను మెట్టుగా వేసుకున్న నల్లచెరువు వాసులు

ఒకే కాంట్రాక్టర్ 30 నుంచి 40 వర్క్‌లు..

ఇటీవల కాలంలో సుమారు 300 వర్క్‌లకు దాకా టెండర్లు పిలిచారు. సదరు వర్క్‌ల్లో టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లు 30 నుంచి 40 వర్క్‌లు దక్కించుకుంటున్నారు. అయితే సదరు వర్క్‌లు చేయలేక పోవడంతో పాటు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక రావడంతో సదరు వర్క్‌లను తగ్గించుకుంటున్నట్లు సమాచారం. ఒకటి, రెండు వర్క్‌లు వేసుకుని మిగిలిన వారికి అవకాశం కల్పిస్తే బాగుంటుంది.. కాదా ఇలా అంతా మాకే కావాలని తమ్ముళ్లు ఆరాటపడటం ఎంత వరకు సమంజసం అని తోటి కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్తి పన్ను యజమాని పేరుతోనే ఉండాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: ఆస్తి పన్ను ఇంటి యజమాని పేరుతోనే ఉండాలని, ఆ విధంగా లేని వారు ఈ నెలాఖరు లోపు స్థానిక వార్డు సచివాలయంలో దరఖాస్తు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సెప్టెంబర్ ఒకటి నుంచి నక్షా(నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్) ప్రకారం రీ సర్వే జరుగుతుందని వివరించారు. సదరు సర్వే మేరకు ఆస్తి పన్ను కలిగిన వారికి ఓనర్ షిప్ కార్డ్ జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నగరంలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే ఆటో మ్యూటేషన్ జరుగుతుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ జరిగి ఆస్తి పన్నులో పేరు మార్పు కాని వారు ఈ నెలాఖరు లోగా వార్డు సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శికి అటెస్టెడ్ చేసిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ప్రస్తుత ఆస్తి విలువ (మార్కెట్ వ్యాల్యూ) సర్టిఫికెట్, సెల్ఫ్ డిక్లరేషన్, బకాయిలు చెల్లించిన ఆస్తి పన్ను రశీదు, ఆస్తి యజమాని ఆధార్ నకలు కాపీలను అందించి దరఖాస్తు చేయాలన్నారు.

30లోపు నిరక్ష్యరాస్యుల వివరాలు నమోదు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో ఈ నెల 30వ తేదీలోపు నిరక్షరాస్యుల వివరాల నమోదు సర్వే పూర్తి కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మెప్మా సీఎంఎంలు, సీఓలను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిరక్షరాస్యుల, వీధి వ్యాపారుల సర్వేపై మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

పనులు పరిశీలన

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆర్టీఓ ఆఫీస్ రోడ్‌లో జరుగుతున్న సెంట్రల్ డివైడర్ పనులను, రెడ్డిపాలెం, గోరంట్ల, శ్రీనగర్, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్య విభాగ బలోపేతం ద్వారా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం అందించేందుకు కృషి చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ రామారావు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్‌ని కమిషనర్ చాంబర్‌లో నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): రోడ్ వైండింగ్ వర్క్స్, విద్యుత్ లైన్ మెయింట్‌నెన్స్ పనుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. పట్టాభిపురం, లక్ష్మీపురం, రామన్నపేట తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు. 11 కేవీ లైన్ షిఫ్టింగ్ కారణంగా గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎస్ కాలనీ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 డీఈఈ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో అర్చన



గుంటూరు ఎడ్యుకేషన్: సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా శుక్రవారం కొత్తపేటలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో లక్ష తమలపాకులతో స్వామివారికి అర్చన నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు హనుమాన్, శ్రీనివాస్ ఈశ్వర్ వేదమంత్రాల నడుమ ఆకు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో యువత ప్రతినిధులు యుగంధర్ నాయుడు, పసుపులేటి రమణమూర్తి, తోట నాగేశ్వరరావు, ఎర్రగోపు జైదీప్, ఎం. రమేష్, తరుణ్ శ్రీకర్ పాల్గొన్నారు.

నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

మేయర్ కోవెలమూడి రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, పక్కన ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరంలో నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా నగరంలో పారిశుద్ధ్యంలో మెరుగైన మార్పు రావాలని, అందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. శుక్రవారం తూర్పు ఎమ్మెల్యే నసీర్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి శనివారం నిర్వహించనున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమాలపై నోడల్ అధికారులతో కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని సచివాలయాల వారీగా ప్రజాప్రతినిధులను, స్థానిక ప్రజలను, ఎస్‌జీఓలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. శనివారం నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాలలో నీటి కాల్వలు, మురుగు కాలువలు, నీటితో నిండిన ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య, కాలువ శుభ్రపరిచే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఎదగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఎదగాలని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. కౌండిన్య ఐఏఎస్ అకాడమీ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతగా నిలిచిన టీజేపీఎస్ కళాశాల బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థిని ఆళ్ల స్వరాజ్యలక్ష్మిని శుక్రవారం పట్టాభిపురంలోని కళాశాలలో అభినందించారు. కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థి దశలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని సూచించారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో అధిగించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి పాల్గొన్నారు.

తూర్పు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ప్రతి కేసు నమోదు చేశాక ఆ కేసుకి సంబంధించిన ప్రతి అంశం రికార్డుల్లో సమయ అనుకూలంగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం గుంటూరు తూర్పు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సాధారణ వార్షిక తనిఖీలు చేపట్టారు. పోక్సో కేసులు, గం జాయి, తీవ్ర నేరాలకు సంబంధించి కేసుల రికార్డులను పరిశీలించారు. ఆయా కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం చేయాలన్నారు. రౌడీషీటర్ల కార్యకలాపాలపై, గంజాయి సరఫరా, విక్రయం, వినియోగం చేసే వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని అన్నారు. అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. తూర్పు డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్, లాలాపేట, కొత్తపేట, పాతగుంటూరు సీఐలు శివప్రసాద్, ఎం.వీరయ్యచౌదరి, వెంకటప్రసాద్, ఎస్పీ సీసీ ఆదిశేషు పాల్గొన్నారు.

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

గుంటూరు మెడికల్: ప్రముఖ సినిమా హీరో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం గుజ్జనగుండ్లలోని శ్రీ విఘ్నేశ్వర డ్రామా డ్రెస్ కంపెనీలో సినీ డైరెక్టర్ శివ నాగేశ్వరరావు వీరెళ్ళ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ శ్రీనివాస్ నాయుడు, సింగంశెట్టి వీరయ్య, వి.శేఖర్ బాబు, వి.శ్రీనివాస్, వి.శివ నాగేశ్వరరావు. తుపాకుల శంకరరావు, తన్నీరు రత్నగిరి, చిరంజీవి అభిమానులు పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

కాపు హాస్టల్‌లో..

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు నగరం, గోరంట్లలోని కాపు హాస్టల్‌లో తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో మెగాస్టార్, తెలుగు సినిమా కింగ్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కాపునాడు ఎడిటర్ మారిశెట్టి మురళీ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాపు హాస్టల్ ఇన్‌చార్జి బాలిశెట్టి విజయ్‌కుమార్, జీవీ నాయుడు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాలలో చదువుతున్న 27 మంది విద్యార్థులు ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో మొదటి ఏడాది ఏఎన్‌యూలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు రెండో సంవత్సరంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులై, 'ఏ' సర్టిఫికెట్‌కు అర్హత సాధించారని వివరించారు. కార్యక్రమంలో ఏవో వినీత్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యం

ఎస్పీ సతీష్‌కుమార్



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

లక్ష్మీపురం: సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన నేరాలను నియంత్రించవచ్చని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోబాల్ట్ పేట 3వ లైన్ నుంచి 7వ లైన్ వరకు శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ముగ్గురు డీఎస్పీలు, ఎనిమిది మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మొత్తం 125 మందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు సరిగా లేని, నంబర్ ప్లేట్లు లేని మొత్తం 61 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను గుర్తించారు. కోబాల్ట్ పేటలో ఉన్న ఇద్దరు రౌడీ షీటర్లు, 10 మంది సస్పెక్ట్ షీటర్లను పరిశీలించి, వారి కదలికల గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకత ఉన్న ప్రదేశాలను గుర్తించి అక్కడ ఏర్పాటు చేయాలని స్థానిక సీఐను ఆదేశించారు. ఎస్పీ వెంట మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ పోలీస్ నంబర్లు కేటాయింపు

నగరంపాలెం: ప్రయాణికుల భద్రతలో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ పోలీస్ నంబర్ ఎంతగానో ఉపయోగపడుతోందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీస్ నంబర్ కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 10,600 ఆటోలకు నంబర్లను జారీ చేశామని తెలిపారు. నంబర్ తీసుకోని వారు ధ్రువపత్రాలతో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఈ ప్రక్రియ వచ్చేనెల ఆఖరు వరకు ఉంటుందని అన్నారు. అనంతరం ఆటోడ్రైవర్లతో కాసేపు జిల్లా ఎస్పీ ముచ్చటించారు. తూర్పు ట్రాఫిక్ పీఎస్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐలు రవీంద్రబాబు, శ్రీహరి, సాంబశివరావునాయక్, నరేంద్ర, ఆర్ఎస్ఐ మదన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

ఎమ్మెల్యే నసీర్‌కు వినతి



ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు

లక్ష్మీపురం: మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడం వలన నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి గుంటూరు నగర ఆటో డ్రైవర్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు నల్లపనేని శివాజీ కోరారు. గుంటూరు నగర ఆటో డ్రైవర్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం తూర్పు శాసన సభ్యుడు నసీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడం వలన బాడుగలు లేక నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర ద్వారా ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక అనేకమంది ప్రైవేటు ఫైనాన్స్ వద్ద మరియు బ్యాంకులలో లోను తీసుకొని ఆటోలు కొనుగోలు చేసి జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. వీరు ప్రతి నెల ఈఎంఐలు చెల్లిస్తూ పిల్లల్ని చదివించుకుంటూ వారి కుటుంబాలని పోషించుకుంటూ వేలాదిమంది ఈ రంగం మీద జీవనోపాధి పొందుతున్నారన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల బాడుగ లేక నష్టపోతున్న డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. గుంటూరు లాంటి నగరాలలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రవాణా రంగా కార్మికులను ఆదుకుంటామని, జీఓ నంబర్ 20 రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. వీటికి తోడు ఓలా ఓబార్ కంపెనీలు నడుపుతున్న యాపులు వల్ల డ్రైవర్స్ అనేక ఇబ్బందులు గురవుతున్నారని ,ఈ యాప్‌లను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. వాహన. ఫిట్నెస్ ఏటీఎస్ ఆటోమేటిక్ ట్రాక్స్‌ను ప్రైవేటు వారికి ఇవ్వయకుండా ప్రభుత్వమే వాటిని నిర్వహించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు మస్తాన్‌వలి, సీఐటీయూ తూర్పు, పశ్చిమ కమిటీల ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు మరియు ఆటో డ్రైవర్స్ సమీవుల్లా, ఇస్మాయిల్, ఖాసిం పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో అనంత అవకాశాలు



హెచ్‌ఎం నాగమంజరితో పాటు విద్యార్థులకు పోస్టర్లు అందజేస్తున్న శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాచీన జ్ఞానం నుంచి అత్యాధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం దిశగా ముందుకు సాగుతున్న అంతరిక్ష రంగంలో అనంతమైన అవకాశాలున్నాయని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అన్నారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా భారత్‌పేటలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతమూర్తి మాట్లాడుతూ ఈనెల 23న భారతదేశం రెండవ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటోందని చెప్పారు. ఆర్యభట్ట మొదలు గగన్‌యాన్ వరకు ప్రాచీనమైన జ్ఞానం నుంచి అత్యాధునిక శాస్త్రసాంకేతిక జ్ఞానంపై ముందుకు సాగుతోందని అన్నారు. చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండింగ్ అయిన విజయానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అనంతరం అంతరిక్ష విజ్ఞానంపై ప్రశ్నలు ఏసిన విద్యార్థులకు స్పేస్ సైన్స్ పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగమణిమంజరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యంగ్ సైంటిస్ట్ సోమశేఖర్‌కు అభినందన



సోమశేఖర్‌ను అభినందిస్తున్న డీన్ సత్యారామ్, ప్రిన్సిపాల్ సుధాకర్

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ నుంచి యువికా యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్న డాక్టర్ కేకేఆర్ గౌతమ్ పాఠశాల పదో తరగతి విద్యార్థి వక్కపట్ల సోమశేఖర్‌ను పాఠశాల డీన్ సత్యారామ్, ప్రిన్సిపాల్ సుధాకర్ అభినందించారు. శుక్రవారం నవభారత్‌నగర్లోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా సోమశేఖర్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్స్, క్విజ్, సైన్స్ హాక్, స్పేస్ క్వి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన తమ విద్యార్థి సోమశేఖర్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి చంద్రయాన-3 అవార్డు అందుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మారెడ్డి, అనిల్, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నగరంపాలెం: రోడ్డు ప్రమాదంలో పురోహితుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెదకాకాని మండలానికి చెందిన శోభాద్రి ఆచార్యులు(21) మంగళగిరి చినకాకానిలోని ఓ దేవాలయంలో పురోహితుడిగా పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై రామిరెడ్డితోట ప్రకాష్‌నగర్ మూడో వీధి వైపు వస్తున్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మరో వ్యక్తి ఓవర్‌టేక్ చేసే క్రమంలో పురోహితుని మోటారుసైకిల్‌ను ఢీకొంది. దీంతో పురోహితుడు ట్రాక్టర్ టైర్ల కిందపడిపోయాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శోభాద్రి ఆచార్యులకు మూడు నెలలు క్రితమే వివాహమైనట్లు తూర్పు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.